క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: కురాన్నపేట్ ఫీడర్ పరిధిలోని 11కేవీలో మరమ్మతుల నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. కురాన్నపేట్, షేక్‌సాబ్‌పేట్, వెంకటాద్రిపేట్, కాల్వగడ్డ, గుల్జార్ మార్కెట్, బాలాజీవాడ, బ్రహ్మపురి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అయ్యప్ప పడిపూజ



స్వామివారికి హారతినిస్తున్న భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూర్ గ్రామంలో గట్టుపల్లి శ్రీనివాస్ అనే భక్తుడి నివాసంలో బుధవారం ఘనంగా అయ్యప్ప పడిపూజను నిర్వహించారు. గణపతి, కుమారస్వామి, సుబ్రహ్మణ్యం చిత్రపటాలను అలంకరించారు. పంచామృతాలతో అభిషేకం చేశారు. గురుస్వామి జక్కని గజేందర్ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు చేపట్టారు. నటరాజ్, రాజేందర్‌రెడ్డి, కడార్ల హరిప్రసాద్, జితేందర్ రావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

సారంగాపూర్: మండల సర్వసభ్య సమావేశానికి బుధవారం సభ్యులు గైర్హాజరవడంతో కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో సరోజ తెలిపారు. మళ్లీ సమావేశం నిర్వహించే తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు. కాగా అవిశ్వాసం నేపథ్యంలో ఎంపీటీసీ సభ్యులు శిబిరాలకు వెళ్లడంతోనే సమావేశం వాయిదా పడినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.

నర్సరీ పరిశీలన



నర్సరీ పరిశీలిస్తున్న ఏపీడీ ప్రసాద్

లోకేశ్వరం: మండల కేంద్రంలోని నర్సరీని బుధవారం ఏపీడీ ఓజ ప్రసాద్ పరిశీలించారు. ఏపీడీ మాట్లాడుతూ నర్సరీల్లో పాలిథిన్ కవర్లల్లో మట్టి నింపి వాటిలో మొక్కలు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, టీఏ శారద ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి

సోన్: కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందినవారు యాసంగి రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని సోన్ ఏవో వినోద్ బధవారంఒ ప్రకటనలో తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంక్ జిరాక్స్‌లు, రైతుబంధు దరఖాస్తులను రైతువేదికలో ఏఈవోలకు అందించాలని ఆయన సూచించారు.

కూలీలు పనులకు వెళ్లాలి



ధర్మోరలో మాట్లాడుతున్న ఏపీవో జగన్నాథ్

లోకేశ్వరం: కూలీలు తప్పనిసరిగా ఉపాధిహామీ పనులకు వెళ్లాలని ఈజీఎస్ ఏపీవో జగన్నాథ్ అన్నారు. బుధవారం మండలంలోని ధర్మోర, గడ్‌చాంద, నరసింహనగర్, సాథ్‌గాం తదితర గ్రామాల్లో ఉపాధిహామీ గ్రామసభలను నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీవో మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 2024–25లో చేపట్టే ఉపాధి పనులు ఎంపిక చేసి ప్రణాళికలు తయారు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, టీఏలు మంజుల, శారద, రవీందర్ ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి సాయం



చెక్కు ఇస్తున్న లా కాలేజీ పూర్వవిద్యార్థులు

సర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన అడ్వకేట్ సురకంటి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. అతడితో కలిసి ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజ్‌లో 2000–03లో చదివిన మిత్రులు బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి కుమారునికి రూ.1లక్ష 50 వేల చెక్కును ఆర్థికసాయంగా అందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో లా కాలేజ్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల్లో ‘మధ్యాహ్న’ కార్మికులు

- ఐదు నెలలుగా అందని గౌరవ వేతనాలు
- మూడు నెలలుగా రాని బిల్లులు
- విద్యార్థులకు భోజనం అందించేందుకు అవస్థలు
- పలు పాఠశాలల్లో వంటగదులు కరువు



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న కార్మికురాలు

ముధోల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెట్టే కార్మికులకు కష్టాలు తప్పడం లేదు. గత ఐదు నెలలుగా వేతనం, మూడు నెలలుగా బిల్లులు రాక కుటుంబపోషణకు ఇబ్బంది పడుతున్నామని కార్మికులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అప్పులు చేసి భోజనం వండి పెడుతున్నామని.. నూతన ప్రభుత్వమైనా తమకు ప్రతినెలా వేతనం, బిల్లులు అందించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

మండలంలో..

ముధోల్ మండలంలోని ఆయా గ్రామాల్లో మొత్తం 41 పాఠశాలలున్నాయి. వీటిలో 29 ప్రాథమిక పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలలు, 8 ఉన్నత పాఠశాలలున్నాయి. మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులు 3,057 మంది, 75 మంది కార్మికులు ఉన్నారు. ప్రభుత్వం కార్మికులకు గౌరవ వేతనం నెలకు రూ.3 వేలు అందిస్తుంది.

తరగతుల వారీగా బిల్లుల చెల్లింపు..

విద్యార్థులకు భోజనం అందించినందుకు తరగతుల వారీగా ప్రభుత్వం కార్మికులకు వేతనంతోపాటు అదనంగా బిల్లులు అందిస్తుంది. ప్రస్తుతం ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు భోజనం అందించినందుకు ఒక్కో విద్యార్థికి రూ.5.40పై, ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు భోజనం అందించినందుకు ఒక్కో విద్యార్థికి రూ.8.17పై.. తొమ్మిది నుంచి పదో తరగతి వరకు భోజనం అందించినందుకు ఒక్కో విద్యార్థికి రూ.10.67పై బిల్లులు అందిస్తున్నారు. వారంలో ఒకసారి విద్యార్థులకూ కోడిగుడ్డు అందించాలి.. దీనికిగాను రూ.5ను నిర్వాహకులకు అందిస్తారు.

విడుదల చేయాలి..

మధ్యాహ్న భోజన కార్మికులకు ఐదు నెలలుగా గౌరవ వేతనం.. మూడు నెలలుగా బిల్లులు అందడం లేదు. దీంతో అప్పులు చేసి నిత్యావసర సరుకులు, కూరగాయలను తీసుకొచ్చి విద్యార్థులకు వండిపెడుతున్నామని నిర్వాహకులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమకు బిల్లులు విడుదల చేయాలని కోరుతున్నారు.

నిలిచిన వంటగదుల నిర్మాణం..

సర్కారు బడుల్లో ప్రవేశాలను పెంచేందుకు ప్రభుత్వం బడిబాట కార్యక్రమం.. మన ఊరు– మన బడిలో భాగంగా తరగతుల నిర్మాణం చేపడుతుంది. కానీ మధ్యాహ్న భోజనం వండేందుకు సౌకర్యాలను మాత్రం కల్పించడం లేదు. మండలంలోని ఆయా గ్రామాల్లో పాఠశాలలో వంటగదుల నిర్మాణం కోసం ప్రభుత్వం ఈజీఎస్ నుంచి నిధులు కేటాయించింది. కొన్ని పాఠశాలల్లో నిర్మాణ పనులు కొనసాగుతుండగా.. మరికొన్ని పాఠశాలల్లో నిలిచిపోయాయి. కట్టెల పొయ్యిపై వంట చేస్తుంటే వచ్చే పొగతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 41 పాఠశాలలకు గానూ 21 పాఠశాలలో సరైన వసతులు లేవు.

ఉన్నతాధికారుల దృష్టికి..

మండలంలోని ఆయా పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం విడతల వారీగా వేతనాలు, బిల్లులు అందిస్తుంది. ఇప్పటికే కార్మికుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– మైసాజీ, ఎంఈవో

అప్పులు చేసి వండిపెడుతున్నాం



ఐదు నెలలుగా మాకు గౌరవ వేతనం అందలేదు. మూడు నెలలుగా బిల్లులు రావడం లేదు. అప్పులు చేసి రోజు విద్యార్థులకు వంట చేసి పెడుతున్నాం. ఏటా మాకు తిప్పలు తప్పడం లేదు. ప్రతి నెల వేతనాలందిస్తే మాకు మేలు జరుగుతుంది.

– పుష్పలత, కార్మికురాలు, ముధోల్

వసతుల్లేక ఇబ్బందులు



మా ప్రాథమిక పాఠశాలలో వంట చేసేందుకు వసతులు లేవు. వంటగది నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కట్టెల పొయ్యిపై వంట చేస్తే పొగతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

– భూదేవి, కార్మికురాలు, పిప్రి

ప్రజాసమస్యలు పరిష్కరించండి

- గూడు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు
- కడెం సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు
- గ్రామాల్లో బెల్ట్‌షాపుల తొలగింపునకు ఆదేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

కడెం: అధికారులు, పాలకులు సమన్వయంతో వ్యవహరిస్తూ.. గ్రామాల్లోని ప్రజాసమస్యలను పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అలెగ్జాండర్ అధ్యక్షతన కడెం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా.. దీనికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గూడు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని.. ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని తహసీల్దార్ రాజేశ్వరికి సూచించారు. గత ప్రభుత్వం పంచాయతీలపై భారం మోపి, సర్పంచ్‌లను అప్పులపాలు చేసిందన్నారు. కడెం ప్రాజెక్ట్ ఆధునీకరణ కోసం నివేదికను సీఎం రేవంత్‌రెడ్డికి అందిస్తానన్నారు. కడెంలో 108 అంబులెన్స్ ఏర్పాటుతోపాటు కడెం ప్రాజెక్ట్ వరదలతో నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ ఎస్సై రవికుమార్‌ను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 24 గంటలు వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. తమ శాఖల నివేదికలను సమర్పించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలిచ్చారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు.

- పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం రాయితీ ఇస్తుందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ క్లస్టర్ అధికారి సాదుల మౌనిక తెలిపారు.
- రోడ్డు సౌకర్యం లేని మారుమూల గ్రామాల్లోని గర్భిణులు కడెం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన బర్త్ వెయిటింగ్ రూంను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి రాజ్‌కుమార్ అన్నారు.
- గంగాపూర్ బ్రిడ్జికి రూ.22 కోట్లు మంజూరయ్యాయని, టెండర్ ప్రక్రియ పూర్తయితే వంతెన నిర్మాణం చేపట్టనున్నట్లు పీఆర్ ఏఈ లవకుమార్ అన్నారు.
- కడెం నూతన ప్రాజెక్ట్ నిర్మాణానికి సుమారు 800 కోట్ల అంచనాతో ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు, ప్రస్తుతం ప్రాజెక్ట్ దిగువన నూతన ప్రాజెక్ట్ నిర్మాణ సాధ్యాసాధ్యాలపై డ్రిల్లింగ్ పనులు చేస్తున్నట్లు డీఈ బోజదాసు, ఏఈ రవికుమార్ తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి సంధ్యారాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు రఫీక్, ఎంపీవో ఉపేందర్ ఏపీవో జయదేవ్, విద్యుత్ ఏఈ సు మన్‌కుమార్, ఆర్‌అండ్‌బీ డీఈ మల్లారెడ్డి, ఎఫ్ఆర్వో అనిత, ఏపీఎ రాజారాం, సర్పంచ్‌లు అనూష, రాజమణి, సదర్లాల్, ఎంపీటీసీలు సింధూజ, కీర్తన, రమేశ్, దాసునాయక్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న ఎంపీడీవో సోలమాన్‌రాజ్



సోన్ : మాట్లాడుతున్న ఎంపీపీ మానసరెడ్డి

లోకేశ్వరం: మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వద్దని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో నర్సరీల పెంపకం పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఇంటింటా పంచాయతీ ట్రాక్టర్ ద్వారా చెత్తను సేకరించాలని సూచించారు. పంచాయతీల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వర్తిస్తూ ఇంటి పన్నులు వసూలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రఘువంశీ, ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్ తదితరులున్నారు.

సోన్: మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై బుధవారం ఎంపీపీ మానసరెడ్డి, ఎంపీడీవో మోహన్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీల పెంపకం, పారిశుద్ధ్యం, ఉపాధిహామీ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖలీల్ హైమద్, ఏపీఓ మంజులారెడ్డి, టీఏలు కృష్ణ, సంధ్య, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



భైంసాలో ఎమ్మెల్యే రామారావ్‌తో అంగన్‌వాడీలు

భైంసాటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు.. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని తన నివాసంలో వారిని కలిసి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను విన్నవించారు. అంతకుముందు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో భైంసా ప్రాజెక్ట్ అధ్యక్షురాలు అనసూయ, ఉపాధ్యక్షురాలు అరుణ, పట్టణాధ్యక్షురాలు సంధ్యారాణి తదితరులు ఉన్నారు.

పరామర్శ

భైంసాటౌన్: పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన విజయగిరి విఠల్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో బుధవారం ఎమ్మెల్యే రామారావుపటేల్ మృతుడి ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు బి గంగాధర్, తాడేవార్ సాయినాథ్, తూమోల్ల దత్తాత్రి, మల్లేశ్వర్, పోశెట్టి, తదితరులున్నారు.

క్యాంప్ కార్యాలయం సందర్శన

ముధోల్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే పవార్ రామారావుపాటిల్ బుధవారం సందర్శించారు. కార్యాలయంలో జరుగుతున్న పనుల వివరాలు తెలుసుకున్నారు. వారి వెంట బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న, మోహన్‌రెడ్డి, రమేశ్, ప్రవీణ్‌దేశాయ్, దశరథ్, సాయినాథ్, ధర్మపురి శ్రీనివాస్, పోతన్న, సంతోష్‌పటేల్, విజేశ్ తదితరులు ఉన్నారు.

నిర్మల్ ఎమ్మెల్యేకు పెయింటింగ్ అందజేత



ఎమ్మెల్యేకు పెయింటింగ్ అందిస్తున్న నవీన్

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన బ్రహ్మదండి నవీన్ అనే కళాకారుడు నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చిత్రపటం గీసి బుధవారం వారికి అందించారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను కలిశారు. నవీన్‌ను ఎమ్మెల్యే అభినందించారు.ఇందులో బీజేపీ మండల అధ్యక్షులు గోవర్ధన్, మండల ఉపాధ్యక్షుడు గుడ్ల రంజిత్, గంగాధర్, అశోక్, రాజ్‌కుమార్, రాజారెడ్డి, వెంకటేష్, మోహన్, ఓస రాజేశ్వర్, కంతి రమేశ్, రాములు, శ్రీను, ముత్యం, గంగన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పాత్రికేయులు

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బుధవారం నూతన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డిని మండలంలోని పాత్రికేయులు మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఇందులో బీజేపీ మండల ఇన్‌చార్జి అయిండ్ల భూపాల్‌రెడ్డి, ప్రెస్‌క్లబ్ మండలాధ్యక్షుడు గోలి గంగధార్, పాత్రికేయులు జడ్డి శ్రీనివాస్, రాజాగౌడ్, ముత్యం, వెంకటేశ్వర్‌రాజు, రాజేంద్రప్రసాద్, మహేశ్, ఈశ్వర్, శేఖర్ తదితరులున్నారు.

ప్రబంధకారిణి సమావేశం



మాట్లాడుతున్న కోశాధికారి సుదర్శన్

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో బుధవారం ప్రబంధకారిణి సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లా కోశాధికారి ధర్మపురి సుదర్శన్ పాల్గొని మార్గదర్శనం చేశారు. విద్యా, భౌతిక, ఆర్థిక విషయాలను చర్చించారు. భవన నిర్మాణ పనులకు అవసరమయ్యే ఖర్చును విరాళాల రూపంలో సేకరించాలని నిర్ణయించారు. పూర్వ విద్యార్థులు, పోషకులు, హిందు బంధువుల తమవంతు విరాళాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రబంధకారిణి సభ్యులు రవీంద్రనాథ్ పాండే, కంది మానాజీ, నిశికాంత్, దర్బార్, కొండావార్ సంతోష్, ప్రధానాచార్యులు సారధిరాజు తదితరులు ఉన్నారు.

వార్షికోత్సవానికి సిద్ధమైన ఆలయం



స్వామివారి ఆలయం

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధిలో ఉన్న దత్తాత్రేయ స్వామి ఆలయ వార్షికోత్సవం ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. 16న కాగడ హారతి, నవరస అభిషేకం, పల్లకి సేవ, 17న గణపతి పూజ, పుణ్యహవచనం, అంకురార్పణ, సర్వతోభద్ర మండల పూజ, పాదుకాభిషేకం, విశేష అర్చన, అగ్నిస్థాపన, లక్ష్మీగణపతి హవనం, శేషహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు తరలిరావాలని కోరారు.

పౌష్టికాహారం అందించాలి



అవగాహన కల్పిస్తున్న ప్రత్యూష

లక్ష్మణచాంద: చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు పౌష్టికాహారం అందించాలని పీహెచ్‌సీ వైద్యురాలు ప్రత్యూష అన్నారు. బుధవారం వరల్డ్ విజన్ ఇండియా ఆధ్వర్య ంలో మండలంలోని వడ్యాల్ రైతువేదికలో అన్ని గ్రామాల అంగన్‌వాడీ టీచర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యురాలు మాట్లాడారు. ఎదిగే పిల్లలకు పోషకాహారం అందకుంటే చదువుపై దృష్టి సారించలేరని పేర్కొన్నారు. చిన్నారుల ఆహారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వరల్డ్ విజన్ సంస్థ మేనేజర్ బ్రహ్మన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, కోఆర్డినేటర్ కరుణ్‌కుమార్, హనుమన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన హరినామ సప్తాహం



ఆలయానికి వెళ్తున్న మహాగాం గ్రామస్తులు



ఆలయంలో దేవతామూర్తులు

భైంసా: మండలంలోని మహాగాం గ్రామంలో బుధవారం హరినామ సప్తాహం ప్రారంభమైంది. విఠల రుక్మిణి దేవతామూర్తుల ఆలయంలో ఏడు రోజుల పాటు సప్తాహం కొనసాగనుంది. రోజు ఉదయం కాగడ హారతి, ఏడు గంటలకు జ్ఞానేశ్వర పారాయణం, రాత్రి 9 నుంచి 11 గంటల వరకు కీర్తనలు కొనసాగనున్నాయి. సప్తాహంలో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో భజన మండళ్లు గ్రామానికి వస్తున్నాయి. గ్రామం నుంచి భక్తులు శోభాయాత్రగా ఆలయానికి వెళ్లి కార్యక్రమం ప్రారంభించారు.

‘ఎంపీ ధీరజ్‌సాహును అరెస్ట్ చేయాలి’



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న నాయకులు

భైంసాటౌన్: కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ధీరజ్‌ప్రసాద్ సాహును అరెస్ట్ చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఏరియాస్పత్రి ముందు అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాలకు నిలయంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణరెడ్డి, రవి పాండే, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, నాయకులు గోపాల్ సర్డా, అసెంబ్లీ కన్వీనర్ సాయినాథ్, సుమన్, తాలోడ్ శ్రీనివాస్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న సొసైటీ సభ్యులు

ఖానాపూర్: పంటలను సేంద్రియ విధానంలో సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని డ్రీమ్ సొసైటీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చిన్నయ్య అన్నారు. బుధవారం మండలంలోని పాతతర్లపాడ్ గ్రామంలో లైక్‌మైట్ చాంపియన్ ద్వారా పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవ శిలీంద్రనాశిని (ట్రైకోడెర్మ) తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. నేల భౌతిక లక్షణాలు వృద్ధి చెంది సారవంతమయ్యేందుకు ఈ సాగు విధానం ఉపయోగపడుతుందన్నారు. విత్తన శుద్ధికి కూడా అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు రవి, చిన్నబాపు, భూపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయండి



తానూరు: మండలంలోని సోనారి జేఎస్ రోడ్డు నుంచి హిప్పెల్లితండాకు వెళ్లే మార్గంలో తానూరు శివారులో మలుపు వద్ద హెచ్చరిక బోర్డు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎదురు వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేవరకు కన్పించడం లేదు. అధికారులు స్పందించి మూల మలుపు తెలిసేలా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: జగదీశ్, పీఆర్ ఏఈ, ఫోన్: 91211 35623